RNI No: TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | గురువారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:51 | జనవరి 29, 2026 | వెల: రూ.3-00





# మహా విషాదం

## బారామతిలో కుప్పకూలిన లియర్‌జెట్ విమానం

2లో

- ప్రమాదంలో ఐదుగురు మృతి.. ధ్రువీకరించిన డీజీసీఏ
- ఎన్నికల ప్రచారానికి వెళ్తుండగా ఘోరం
- ప్రధాని మోదీ, చంద్రబాబు, రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి

## మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం

# భక్తజన గుడారం మేడారం!





### లక్షలాది భక్తుల జయజయ ధ్వానాల నడుమ గద్దెకు చేరిన సారలమ్మ

- పగిడిద్దరాజు, గోవిందరాజులు సైతం గద్దెలపైకి...
- అడవుల్లో మొదలైన ఆదివాసీ కుంభమేళా
- కిక్కిరిసిన జంపన్న వాగు
- శివసత్తులు, భక్తుల పూనకాలతో ఊగిపోయిన జనారణ్యం
- నేడు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క రాక
- తల్లి రాక కోసం ఎదురు చూస్తున్న భక్తజనం
- హైటెక్ నిఘా నీడలో గిరిజన మహా జాతర





వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ అడవి తల్లి సాక్షిగా సాగే మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరలో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాలు, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్ల మధ్య వనదేవతలు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు బుధవారం రాత్రి గద్దెలపైకి కొలువుదీరారు. కన్నెపల్లి నుంచి బయలుదేరిన సారలమ్మ తల్లి రాత్రి 8 గంటల సమయానికి జంపన్న వాగును దాటి, రాత్రి గద్దెపైకి చేరడంతో మేడారం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. అడవి మొత్తం సమ్మక్కసారలమ్మ నామస్మరణతో మార్మోగిపోయింది, నేడు జాతరలో అత్యంత ప్రధాన ఘట్టమైన సమ్మక్క తల్లి ఆగమనం కోసం కోట్లాది మంది భక్తులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. హైటెక్ నిఘా, ఏఐ టెక్నాలజీ నీడలో అధికారుల పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా మేడారం ఇప్పుడు భక్తజన గుడారంగా మారిపోయింది.

2లో

### మేడారం భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు



- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- తొలి ఘట్టం ప్రారంభంపై సమీక్ష
- వాకిటాకీ ద్వారా అధికారులతో చర్చ

2లో



### అతివేగం ఖరీదు.. రెండు ప్రాణాలు

- మేడిపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం
- వేగంగా మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టిన కారు
- ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి
- ముగ్గురి పరిస్థితి విషమం

2లో

## బీజేపీ గెలుపే లక్ష్యం

- ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం
- ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘ చర్చ
- సంస్థాగత బలోపేతానికి దిశానిర్దేశం



2లో

## ఎక్సైజ్ శాఖలో మైక్రో బ్రూవరీస్ కుంభకోణం



- టెండర్లలో భారీ అక్రమాలు
- లిక్కర్ సరఫరా సంస్థలకు వేల కోట్ల బకాయిలు
- బీరు కంపెనీలకు ప్రాధాన్యం
- గౌడన్నలపై నిర్లక్ష్యం.. తాగుబోతుల తెలంగాణగా మార్పు
- హరీష్ రావు సంచలన ఆరోపణలు

2లో

## ఖబడ్దార్.. కేటీఆర్

- యువజన కాంగ్రెస్ నిరసన
- కామినేని వైఎస్ఆర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం



2లో

# ఎక్సైజ్ శాఖలో మైక్రో బ్రూవరీస్ కుంభకోణం

- టెండర్లలో భారీ అక్రమాలు
- హరీష్ రావు సంచలన ఆరోపణలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఎక్సైజ్ శాఖలో చోటుచేసుకుంటున్న మైక్రో బ్రూవరీస్ కుంభకోణంపై మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ శాఖలో మరో భారీ కుంభకోణానికి తెరలేపిందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. మైక్రో బ్రూవరీస్ కోసం 110 దరఖాస్తులు వచ్చినప్పటికీ, అందులో 25 టెండర్లను ముఖ్యనేతలు, మంత్రుల కోటాల పేరిట కేటాయించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. ఒక్కో బ్రూవరీ వద్ద అనధికారికంగా కోట్ల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో ముఖ్యనేతలకు దగ్గరగా ఉన్న వ్యక్తులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా లిక్కర్ సరఫరా సంస్థలకు రూ.4,500 కోట్లకు పైగా బకాయిలు పెట్టారని హరీష్ రావు పేర్కొన్నారు. ఆరు నెలలుగా చెల్లింపులు జరగకపోవడంతో బీరు, బ్రీజర్ సరఫరా నిలిచిపోయిందని, అనేక మల్టీనేషనల్ కంపెనీలు సరఫరా నిలిపివేస్తామని ప్రభుత్వానికి లేఖలు రాసినట్లు వెల్లడించారు. మంత్రుల మధ్య వాటాల పంచాయతీల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, దీని వల్ల రాష్ట్ర ఆదాయం తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బీరు కంపెనీలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యం రైతులకు ఇవ్వడం లేదని ఆయన మండిపడ్డారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వేల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించిన ప్రభుత్వం, అదే ప్రాంతాల్లోని బీరు కంపెనీలకు మాత్రం నీటి సరఫరా కొనసాగిస్తోందని విమర్శించారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశాలతోనే బీరు కంపెనీలకు నీళ్లు అందిస్తున్నారని ఆరోపించారు. ఇది మద్యం తయారీదారులకు కొమ్ముకాసే ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. గీత కార్మికులు, గౌడన్నలపై కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వందల సంఖ్యలో అక్రమ కేసులు పెట్టి గీత కార్మికులను జైలుకు పంపిందని, 850 మంది గౌడన్నలు మరణించినా ఒక్క రూపాయి సహాయం ఇవ్వలేదని విమర్శించారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట ఏర్పాట్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కోటి భక్తుల కొంగు బంగారంగా, తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సమ్మక్క–సారలమ్మ మేడారం మహా జాతరలో అత్యంత పవిత్రమైన తొలి ఘట్టం ప్రారంభమైన నేపథ్యంలో, లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సచివాలయం నుంచి మేడారంలో ఉన్న అధికారులతో వాకిటాకీ ద్వారా మాట్లాడిన మంత్రి, జాతర ఏర్పాట్లపై వివరాలు తెలుసుకున్నారు. తొలి రోజు కావడంతో భక్తుల సంఖ్య, సారలమ్మ వార్ల రాకకు సంబంధించిన ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, జాతరలో నెలకొన్న పరిస్థితులపై సమగ్రంగా ఆరా తీశారు. ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాజాతరలో భక్తుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా అన్ని శాఖలు కలిసి పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తూ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై రద్దీ నియంత్రణ, పార్కింగ్ ఏర్పాట్లు సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రవాణా సౌకర్యాలు, వైద్య సేవలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా పరీక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా చిన్నపాటి ఇబ్బంది కూడా తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సమన్వయంతో పనిచేసి మేడారం మహాజాతరను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం

### రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్ర రావు అధ్యక్షతన తెలంగాణ మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు అవసరమైన వ్యూహాలు, కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి సీ.హెచ్. శేఖర్ పాల్గొని పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ బలాన్ని గ్రామీణ, పట్టణ స్థాయిలో మరింత విస్తరించాలని సూచించారు. అలాగే మహారాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ మంత్రి, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి ఆశిష్ షెలార్, బీజేపీ రాజస్థాన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, తెలంగాణ మున్సిపల్ ఎన్నికల కో–ఇన్‌చార్జి అశోక్ పర్ణామి సమావేశంలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు. ఎన్నికల నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలు, ప్రచార వ్యూహాలపై సూచనలు చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర స్థాయి పదాధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగరవేయాలనే లక్ష్యంతో సమిష్టిగా పని చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

## ఖబడ్దార్ కేటీఆర్..

### దిష్టిబొమ్మ దహనం చేసిన యువజన కాంగ్రెస్

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

జనవరి 26న బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్లను వ్యక్తిత్వంగా హననం చేస్తూ బీఆర్ఎస్ కుట్రపూరితంగా స్కిట్ నిర్వహించిందని ఆరోపిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎల్‌బీ నగర్ నియోజకవర్గం కామినేని వైఎస్ఆర్ చౌరస్తాలో ఖబర్దార్ కేటీఆర్ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, బీజేపీతో అక్రమ సంబంధాలు పెట్టుకున్న బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం మీద, కాంగ్రెస్ నాయకుల మీద విమర్శలు చేయడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. ప్రజల తీర్పుతో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్, ఇప్పుడు రాజకీయ డ్రామాలతో గందరగోళం సృష్టించాలని చూస్తోందని విమర్శించారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల్లో కుటుంబ సమేతంగా భారీ అవినీతి చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువతను, రైతుబంధు పేరుతో రైతులను, సబ్‌ప్లాన్ నిధుల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను మోసం చేసిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఆ పాలన రాష్ట్రాన్ని అభివృద్ధి కాకుండా అంధకారంలోకి నెట్టిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# భక్తజన గుడారం మేడారం..!



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

- లక్షలాది భక్తుల నడుమ గద్దెకు చేరిన సారలమ్మ
- పగిడిద్దరాజు, గోవిందరాజులు సైతం గద్దెలపైకి..
- అడవుల్లో మొదలైన ఆదివాసీ కుంభమేళా
- కిక్కిరిసిన జంపన్న వాగు
- శివసత్తులు, భక్తుల పూనకాలతో ఊగిపోయిన జనారణ్యం
- నేడు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క రాక
- తల్లి రాక కోసం ఎదురు చూస్తున్న లక్షలాది భక్తులు
- హైటెక్ నిఘా నీడలో గిరిజన మహా జాతర

మేడారం మహా జాతరలో అత్యంత కీలకమైన తొలి ఘట్టం ముగిసింది. అడవి బిడ్డలు, వనదేవతలు ఒక్కొక్కరుగా గద్దెలపైకి కొలువుదీరడంతో మేడారం జనసంద్రంగా మారింది. భక్తుల పూనకాలు, శివసత్తుల ఊగులాటలు, డప్పు చప్పుళ్లతో తాడ్వాయి అడవులు మార్మోగిపోతున్నాయి. తెలంగాణ అడవి తల్లి సాక్షిగా సాగే మేడారం సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో బుధవారం రాత్రి చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య వనదేవతలు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి కొలువుదీరారు. దీంతో జాతర అధికారికంగా ప్రారంభమైంది. జాతరలో ప్రధాన ఆకర్షణ అయిన సారలమ్మ తల్లి కన్నెపల్లి నుంచి బుధవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో బయలు దేరి రాత్రి 8 గంటల సమయానికి సారలమ్మ తల్లి జంపన్న వాగు వద్దకు చేరుకున్నారు. ఈ సమయంలో వాగు పరిసరాలు కిక్కిరిసిపోయాయి. లక్షలాది మంది భక్తులు వాగులోనే నిలబడి తల్లికి స్వాగతం పలికారు. జంపన్న వాగు దాటిన తర్వాత, భక్తుల పూనకాలు, శివసత్తుల విన్యాసాల మధ్య తల్లి రాత్రి పదకొండు గంటలకు మేడారం గద్దెపైకి చేరుకున్నారు. గిరిజన పూజారులు తల్లిని శాస్త్రోక్తంగా గద్దెపై ప్రతిష్ఠించారు.

### నేడు సమ్మక్క రాక!

సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు చేరడంతో మొదటి ఘట్టం ముగిసింది. ఇక నేడు సాయంత్రం చిలుకలగుట్ట నుంచి తల్లి సమ్మక్క కుంకుమ భరిణె రూపంలో గద్దెకు రానుంది. ఈ ఘట్టం కోసం కోట్లాది మంది భక్తులు ఎదురుచూస్తున్నారు. వనదేవతల కొలువుతో మేడారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అధికారులు, మంత్రులు క్షేత్ర స్థాయిలో ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, పారిశుధ్య పనులు యుద్ధప్రతిపాదికన జరుగుతున్నాయి.

### పూనకాలతో ఊగిన మేడారం..

సారలమ్మ గద్దెకు వస్తున్న సమయంలో మేడారంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. వేలాది మంది శివసత్తులు పూనకాలతో ఊగిపోతూ, వేప మండలతో దేవతలను ఆహ్వానించారు. భక్తులు తమ కష్టాలు తీరాలంటూ పూజారులు నడిచే దారిలో సాష్టాంగ నమస్కారాలు చేశారు. జంపన్న వాగు నుంచి గద్దెల వరకు ఎటు చూసినా జనమే కనిపించారు. వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, తడి బట్టలతోనే భక్తులు గద్దెల వద్దకు క్యూ కట్టారు. అడవి మొత్తం సమ్మక్క–సారలమ్మ నామస్మరణతో మార్మోగిపోయింది.

### ముందే కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు

సారలమ్మ రాకకంటే ముందే ఆమె తండ్రి (సమ్మక్క భర్త) పగిడిద్దరాజు, భర్త గోవిందరాజులు గద్దెలకు చేరుకున్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సిద్ధబోయిన వంశపు పూజారులు పగిడిద్దరాజును కాలినడకన మేడారం తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుంచి దబ్బకట్ల వంశస్థులు గోవిందరాజులను తీసుకొచ్చి గద్దెపై కొలువుదీర్చారు.

### నిఘా నీడలో జాతర

భారీ జనసందోహం నేపథ్యంలో ఎక్కడా తొక్కిసలాట జరగకుండా ప్రభుత్వం అత్యంత ఆధునిక సాంకేతికతను వాడుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కెమెరాల ద్వారా రద్దీని ఎప్పటికప్పుడు పోలీసులు విశ్లేషిస్తున్నారు. మేడారం పరిసరాలను వందలాది డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. వేలాది మంది పోలీసులు, ప్రత్యేక బలగాలు జాతరలో పహారా కాస్తున్నారు. ముగ్గురు దేవతలు గద్దెలకు చేరే వరకు పోలీసులు ఎక్కడికక్కడ ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ, భక్తులకు ఇబ్బంది లేకుండా చూశారు.


## ఒకప్పుడు మేధావులు చదివిన పాఠశాల..

# నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా!

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

- రాత్రి వేళల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు
- పర్యవేక్షణ లేకపోవడమే కారణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు





ఒకప్పుడు విద్యతో సమాజానికి దిశానిర్దేశం చేసిన ప్రభుత్వ పాఠశాలలు నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పాఠశాల సమయం ముగిసిన అనంతరం ఎలాంటి పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణాలుగా మారాయి. ముఖ్యంగా కొత్త భవనాలు నిర్మించిన తర్వాత పాత పాఠశాల భవనాలు ఖాళీగా ఉండిపోవడంతో అవి మద్యం సేవించడం, చెత్త వేయడం, మలమూత్రాలకు వాడడం వంటి అనుచిత కార్యక్రమాలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

### ప్రశ్నార్థకంగా విద్యార్థుల భవిష్యత్

పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉదయం పాఠశాలకు వచ్చే పిల్లలు చెత్త, మద్యం సీసాలు చూసి భయపడే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇది పాఠశాల ప్రతిష్టకు భంగం కలిగించడమే కాకుండా, విద్యార్థుల మనోస్థైర్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే విద్యా సంస్థల పట్ల గౌరవం తగ్గిపోతుందని, విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### భద్రత ఏర్పాటు చేయాలి

ఈ నేపథ్యంలో రాత్రి వేళల్లో పాఠశాలలకు భద్రత ఏర్పాటు చేయాలని, పాత భవనాలను సక్రమంగా వినియోగించుకోవాలని లేదా కనీసం గేట్లు, లైట్లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పాఠశాలలు అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

## అతివేగం ఖరీదు.. రెండు ప్రాణాలు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంతో ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి మెట్రో పిల్లర్‌ను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, వనపర్తి జిల్లాకు చెందిన ఎనిమిది మంది ఇంజినీరింగ్ విద్యార్థులు ఒకే కారులో ప్రయాణిస్తున్నారు. మేడిపల్లి వద్ద మెట్రో పిల్లర్ నంబర్ 97ను కారు ఢీకొనడంతో సాయి వరుణ్, నిఖిల్ అనే ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద తీవ్రతకు వాహనం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో వెంకట్, రాకేశ్, యశ్వంత్‌లకు తీవ్ర గాయాలు కాగా, వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు వెల్లడించారు. యువత అతివేగంతో వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు.

# మహారాష్ట్రలో విషాదం

- విమాన ప్రమాదంలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ దుర్మరణం
- బారామతిలో కుప్పకూలిన లియర్‌జెట్ విమానం
- ప్రమాదంలో ఐదుగురు మృతి ధ్రువీకరించిన డీజీసీఏ

**వేద న్యూస్, డెస్క్**

మహారాష్ట్ర రాజకీయాల్లో పెను విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ సీనియర్ నేత అజిత్ పవార్ విమాన ప్రమాదంలో అకాల మరణం చెందారు. బుధవారం ఉదయం బారామతిలో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో ఆయనతో పాటు విమానంలో ఉన్న మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అధికారికంగా ధ్రువీకరించింది. కాగా, ప్రమాద స్థలంలో విమానం శకలాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. మంటలు, దట్టమైన పొగలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న వెంటనే అంబులెన్సులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఈ హఠాత్పరిణామంతో మహారాష్ట్ర రాజకీయ వర్గాలు దిగ్భ్రాంతికి గురయ్యాయి.

### ప్రమాదం జరిగిందిలా..

రానున్న జిల్లా పరిషత్, పంచాయతీ సమితి ఎన్నికల ప్రచారంలో భాగంగా బారామతిలో ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో పాల్గొనేందుకు అజిత్ పవార్ బుధవారం ఉదయం ముంబై నుంచి బయలుదేరారు. ఆయన ప్రయాణిస్తున్న వీఎస్సార్ వెంచర్స్‌కు చెందిన లియర్‌జెట్–45 విమానం ఉదయం 8.48 గంటల సమయంలో బారామతి విమానాశ్రయంలో ల్యాండ్ అవుతుండగా ప్రమాదానికి గురైంది. విమానం అదుపుతప్పి క్రాష్ ల్యాండింగ్ అయిందని, ఈ ఘటనలో విమానంలో ఉన్నవారెవరూ ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ వెల్లడించింది. మృతుల్లో అజిత్ పవార్‌తో పాటు ఆయన వ్యక్తిగత సహాయకుడు, ఒక భద్రతా సిబ్బంది, పైలట్, కో–పైలట్ ఉన్నారు. అజిత్ పవార్ మరణ వార్తను ఆయన వ్యక్తిగత సహాయకుడు అనిల్ ధిక్లే కూడా ధ్రువీకరించారు.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

ప్రధాని మోదీ సంతాపం అజిత్ పవార్ ఆకస్మిక మరణంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన నివాళులర్పిస్తూ.. 'అజిత్ పవార్ ప్రజానాయకులు.. కష్టపడి పనిచేసే వ్యక్తి.. మహారాష్ట్ర ప్రజలకు సేవ చేయడంలో, పేదలు, అణగారిన వర్గాల సాధికారత కోసం ఆయన చూపిన తపన ప్రశంసనీయం.. ఆయన అకాల మరణం తీవ్రంగా కలచివేసింది.. మృతుల కుటుంబాలకు మనోధైర్యం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నా' అని పేర్కొన్నారు.

### తెలుగు రాష్ట్రాల సీఎంల సంతాపం

'విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ హఠాత్తుగా మరణించడం షాక్‌కు గురిచేసింది. ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను' అని ఏపీ సీఎం ట్వీట్ చేశారు. అజిత్ పవార్ అకాల మరణం పట్ల తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### ప్రమాదానికి గురైన విమానం విశేషాలు

అజిత్ పవార్ ప్రయాణించిన విమానం కెనడియన్ తయారీ సంస్థ బాంబార్డియర్ రూపొందించిన లియర్‌జెట్–45. ఇది ఒక మధ్య తరహా బిజినెస్ జెట్. రెండు హనీవెల్ టర్బోఫ్యాన్ ఇంజిన్లతో ఇది నడుస్తుంది. గరిష్టంగా 8 మంది ప్రయాణికులను తీసుకెళ్లగలదు. గంటకు దాదాపు 3వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగల సామర్థ్యం దీని సొంతం. సొంత నియోజకవర్గమైన బారామతి గడ్డపైనే అజిత్ పవార్ తుదిశ్వాస విడవడంతో మహారాష్ట్ర వ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి.

వేద న్యూస్

గురువారం జనవరి 29, 2026

# వేద న్యూస్ క్యాలెండర్ ఆవిష్కరణ







**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో వేద న్యూస్-2026 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ నారాయణ రెడ్డి, ఎంపీడీఓ జయశీల, ఎస్ఐ రమాకాంత్ ముఖ్య అతిథులుగా పాల్గొని, వేద న్యూస్ క్యాలెండర్‌ను తమ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. వేద న్యూస్ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, నిజాయితీగా వార్తలను అందిస్తోందని ప్రశంసించారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సకాలంలో అందించేలా వేద న్యూస్ మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టాపర్ రాజు, మండల రిపోర్టర్ మహేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, రాజు, రవి, వేద న్యూస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియ



**వేద న్యూస్, మంచిర్యాల:**

- అభ్యర్థులకు సహాయంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నామినేషన్ల ప్రక్రియ చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, నిర్ణీత సమయం ముగిసిన తర్వాత నామినేషన్లు స్వీకరించబోమని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని 22 వార్డులకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ కేంద్రాల్లో 100 మీటర్ల నిబంధన అమలు చేస్తున్నామని, అభ్యర్థులకు సహాయంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తామని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం నస్పూర్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ (ఫోన్ నం: 08736-250501) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదుల కోసం ఈ నంబర్‌ను సంప్రదించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని శశిరేఖ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బీఆర్ఎస్ పార్టీ 2026 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను పార్టీ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రుద్రూర్ మండల బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ గాండ్ల మధు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడే విధంగా పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా, కట్టుబాటుతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లి, బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డౌర్ సాయిలు, బొట్టే గజేందర్, సిరిగాది శేఖర్, కొత్తపల్లి రవికిరణ్, అల్లావుద్దీన్, శానం పోశెట్టి, ఆర్. పోచయ్య, కర్రోళ్ల వెంకటేష్, సాయికిరణ్, పార్వతి ప్రవీణ్, సంకిరి వీరయ్య, నీరడి సాయిలు, చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య

- శాయంపేట మండలం మైలారంలో విషాదం



**వేద న్యూస్, శాయంపేట:**

తండ్రి మందలించాడనే కారణంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శాయంపేట మండలంలోని మైలారం గ్రామంలో చోటుచేసుకుంది. శాయంపేట ఎస్ఐ జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మైలారం గ్రామానికి చెందిన కుక్కల రమేష్ కుమారుడు కుక్కల అజయ్ ఈ నెల 25వ తేదీ ఆదివారం రాత్రి తండ్రి ఏదైనా పని చేసుకోవాలని మందలించడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే రోజు నల్లగుంట చెరువు కట్ట వద్ద క్షణికావేశంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అజయ్‌ను కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జక్కుల పరమేష్ తెలిపారు.

# బీఆర్ఎస్‌లో చేరేందుకు ర్యాలీగా వెళ్లిన ఆరూరి రమేష్



**వేద న్యూస్, మడికొండ:**

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ బీజేపీని వీడి అధికారికంగా బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న నేపథ్యంలో, కార్యకర్తలతో కలిసి మడికొండ నుంచి బీఆర్ఎస్ పార్టీ జెండాను ఊపుతూ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరూరి రమేష్ మాట్లాడుతూ.. కేటీఆర్ దూరదృష్టి నాయకత్వం, కేసీఆర్ సంక్షేమ పాలనకు ఆకర్షితులై ప్రజలు బీఆర్ఎస్ వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. పార్టీ మార్పు సందర్భంగా ప్రజలు, కార్యకర్తల్లో కనిపిస్తున్న ఉత్సాహమే బీఆర్ఎస్‌పై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన

- దేవాపూర్‌లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ కార్యక్రమం



**వేద న్యూస్, కాసిపేట:**

దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో రైతు సోదరులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. పీఎం కిసాన్ పథకం 22వ విడత ఆర్థిక సహాయం పొందాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఇప్పటివరకు రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు సమీపంలోని మీ సేవ కేంద్రం లేదా తమ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోని పక్షంలో పీఎం కిసాన్ లబ్ధితో పాటు ఇతర ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలు కూడా కోల్పోయే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామపంచాయతీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిడాం రాందాస్, వ్యవసాయ అధికారి సి.హెచ్. ప్రభాకర్, ఏఈఓ మధుపా, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# పర్వత ప్రాంత జీవనోపాధికి 'ఉపాధి' ఆధారం

- కొత్త చట్టంతో పనుల నిర్వహణలో అడ్డంకులు
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



**వేద న్యూస్, ఆదిలాబాద్:**

వేసవికాలంలో పర్వత ప్రాంత ప్రజల జీవనోపాధికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమే ప్రధాన ఆధారమని, ఈ పథకం లేకుంటే వలసలు తప్పవని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. బోథ్ మండలంలోని నాగపూర్, జైనూర్ పల్లె గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలతో కలిసి మన్రేగా బచావో సంగ్రామ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పసుల చంటి మాట్లాడుతూ.. కొత్త చట్టంతో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, పనుల నిర్వహణలో అడ్డంకులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూలీల నుంచి రెండుసార్లు ఫోటోలు తీసే విధానం, డిజిటల్ మస్టర్ విధానాల వల్ల సాధారణ కూలీలకు తమ హాజరు నమోదైందో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొందని విమర్శించారు. ఐరిష్ విధానం, యుక్తధార విధానాలను వెంటనే వెనక్కి తీసుకొని, పాత పద్ధతిలోనే ఉపాధి పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, రాజకీయాల కోసం పథకాల పేర్లు మార్చడం తగదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత విధానంలోనే నిధులు విడుదల చేసి కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగపూర్ సర్పంచ్ సిడాం దేవరావు, దన్నూర్ బి గ్రామ సర్పంచ్ ఎల్మా రోహిణి వినయ్ రెడ్డి, ఉపసర్పంచ్ ప్రభాకర్, గ్రామ పటేళ్లు, యువకులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# బానోత్ దశరథ్‌కు 'బెస్ట్ సోల్జర్' అవార్డు

- ఖమ్మం బిడ్డకు అరుదైన గౌరవం
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన బానోత్ దశరథ్ 17 ఏళ్లుగా భారత సైన్యంలో సేవలు అందిస్తున్నారు. ఆయనను కేంద్ర ప్రభుత్వం బెస్ట్ సోల్జర్ అవార్డుతో సత్కరించింది. దశరథ్ సైనిక ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. 17 ఏళ్ల సేవాకాలంలో ఆయన చూపిన క్రమశిక్షణ, అంకితభావం, ధైర్యసాహసాలు ఉన్నతాధికారుల ప్రశంసలు పొందాయి. జమ్మూ కశ్మీర్‌లోని పాకిస్థాన్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ, దేశ భద్రతకు ముప్పుగా మారిన ఉగ్రవాదులను మట్టుబెట్టే పలు కీలక ఆపరేషన్లలో బానోత్ దశరథ్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. సరిహద్దు భద్రతలో ఆయన సేవలు ప్రశంసనీయమని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రంగా పేరుగాంచిన సియాచిన్ గ్లేసియర్ సమీపంలోని చైనా సరిహద్దుల్లో, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య దేశ రక్షణకు కవచంలా నిలబడి విధులు నిర్వహిస్తున్నారు.



బెస్ట్ సోల్జర్ అవార్డు దశరథ్ కుటుంబంతో పాటు పొలంపల్లి గ్రామంలో పండగ వాతావరణాన్ని నింపింది. ఆయన తల్లిదండ్రులు, భార్య జమున, పిల్లలు సోహాన్ వీర్, శ్రీనిధి గ్రామస్తుల అభినందనల మధ్య ఆనందం వ్యక్తం చేశారు. మా ఊరి బిడ్డ దేశ సరిహద్దుల్లో పహారా కాయడమే కాకుండా, ఉత్తమ సైనికుడిగా అవార్డు అందుకోవడం మా అందరికీ గర్వకారణం అని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

# సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- 39 వార్డులకు పోలింగ్
- నామినేషన్ ప్రక్రియ ప్రారంభం
- పరిశీలన అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటన



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల మున్సిపాలిటీలో ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సిరిసిల్ల పట్టణంలో మొత్తం 39 వార్డులకు మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 81,959 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 39,942 మంది పురుష ఓటర్లు, 42,011 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 6 మంది ఉన్నారు. ఈసారి కూడా సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందని అధికారులు తెలిపారు. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు జిల్లా కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయదలచిన అభ్యర్థులు వార్డు వారీగా నామినేషన్ పత్రాలను సంబంధిత ఎన్నికల అధికారికి దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్‌తో పాటు అభ్యర్థి అఫిడవిట్, ఆస్తులు, బాధ్యతల వివరాలు, అవసరమైన చోట కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థులు తప్పనిసరిగా పార్టీ బీ ఫారమ్ జత చేయాలని, స్వతంత్ర అభ్యర్థులు ప్రతిపాదకుల సంతకాలు సమర్పించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హులైన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని, నిర్ణీత గడువు లోపు నామినేషన్ ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, న్యాయంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

వేద న్యూస్

గురువారం జనవరి 29, 2026

# గాంధారి ఖిల్లా మైసమ్మ జాతర వాల్ పోస్టర్ల విడుదల

**వేద న్యూస్, కాసిపేట :**

కాసిపేట మండల కేంద్రంలోని దేవాపూర్ ఓరియంట్ ఆదాని సిమెంట్ కంపెనీ గేటు సమీపంలో బుధవారం గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరకు సంబంధించిన గోడప్రతులను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆదివాసి నాయకపోడు సేవా సంఘం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 30, 31, ఫిబ్రవరి 1వ తేదీలలో జరగనున్న గాంధారి ఖిల్లా మైసమ్మ జాతరను పురస్కరించుకొని గోడప్రతుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదాని కంపెనీ యాజమాన్య అధికారులు, ఆదివాసి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకులు కలిసి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాపూర్ సర్పంచ్ సిద్ధం రాందాస్, ఆదాని హెచ్ఆర్ అధికారి నరేంద్ర, ఆదివాసి నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జాన్వి తట్రా భీమరావు, ఆలయ కమిటీ చైర్మన్ రొడ్డ రమేష్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆడ జంగు, జిల్లా ప్రధాన కార్యదర్శి కనకరాజు, యూనియన్ ప్రధాన కార్యదర్శి భీమిని మహేందర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాల్వ సతీష్ రెడ్డి, రాయి సెంటర్ ఉపసర్పంచ్ మెరుగు శంకర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆత్రం



మహేష్, కొలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షులు బద్ది శ్రీనివాస్, ఆదివాసి నాయకపోడు సేవా సంఘం మండల అధ్యక్షులు రొడ్డ కిష్టయ్య, యూనియన్ ఉపాధ్యక్షులు అరుణ్ జయరాం, రొడ్డ అనిల్ తదితరులు పాల్గొన్నారు. జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు.

# 8వ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అజాహరుద్దీన్

**వేద న్యూస్, కరీంనగర్:**



కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్ (అల్గునూర్) కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మహ్మద్ అజాహరుద్దీన్ ను నియమించారు. ఈ మేరకు బుధవారం మాన కొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గోపు మల్లారెడ్డి గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మనవేణి రమేశ్ యాదవ్, 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి గోపు మల్లారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు రహమత్ హుస్సేన్, మాజీ కార్పొరేటర్ చల్లా రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది లక్ష్మీనారాయణ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, మామిడి నరేందర్ రెడ్డి, చిందం కిష్టయ్య, దాసం నాగేందర్, జాప రాఘవరెడ్డి, జాప రవీందర్ రెడ్డి, సింగం శ్రీనివాస్, కొమురయ్య, చిల్ల రాములు, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం

- ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించొచ్చు
- సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొక్కాల రాము

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో మండల ముదిరాజుల ఆధ్వర్యంలో ముదిరాజ్ ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ కులానికి చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చొక్కాల రాము పాల్గొని మాట్లాడారు. ముదిరాజులందరూ ఐక్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని, దానికి ఇల్లంతకుంట మండలంలోని ముదిరాజుల ఐక్యతే నిదర్శనమని అన్నారు. ఐక్యతతోనే ఏడు గ్రామాల్లో ముదిరాజ్ సర్పంచులు ఎన్నిక కావడం శుభపరిణామమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే ఐక్యత కొనసాగిస్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ పదవుల్లో ముదిరాజ్ నాయకులు గెలుపొందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ కుటుంబాల పిల్లలను చదువులో ముందుకు తీసుకెళ్లాలని, విద్యతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద జనాభా కలిగిన ముదిరాజ్ కులం ఇక ఆశించే స్థాయిలో కాకుండా, శాసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన ముదిరాజ్ సర్పంచులు పండుగ సునీత, గౌరవేణి శ్రీవాణి, కుడుముల రేణుక, చింతమడక కళ్యాణ్, చొప్పరి భూమయ్య, గొడుగు విట్టల్, గూడెల్లి స్వప్న పాల్గొన్నారు. అలాగే జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు చొప్పరి రామచంద్రం, ప్రధాన కార్యదర్శి సరుగు నరేష్, మండల అధ్యక్షుడు ఎలవేణి రమేష్, గౌరవ అధ్యక్షులు కంకటి ప్రభాకర్, కనుకయ్య, బీసీ మహాసభ అధ్యక్షులు బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి కొమ్ముల నరసింహం, పల్లె రాజశేఖర్, పరశు రాములు, నాగరాజు, ఎంద్ర చందన్, ముదిరాజ్ వార్డు సభ్యులు, ముదిరాజ్ కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టంపై అవగాహన సదస్సు

- పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరం
- మండల కో కన్వీనర్ కరికె నవీన్ కుమార్



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ ఆజీవిక మిషన్ గ్రామీణ్ (వీబీజీ రామ్‌జీ) చట్టం-2025పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల కో కన్వీనర్ కరికె నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రామ్‌జీ చట్టం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. గతంలో ఉన్న 100 రోజుల ఉపాధి పనిని ఇప్పుడు 125 రోజులకు పెంచినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు 6 శాతం నుంచి 9 శాతం వరకు వేతనాలు పెంచినట్లు వివరించారు. సంవత్సరంలో 60 రోజులు సెలవు దినాలు ప్రకటించుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. వేతనాల చెల్లింపులో పూర్తి పారదర్శకతను పాటిస్తూ పేద ప్రజలను ఆదుకునే విధంగా ఈ చట్టాన్ని రూపొందించారని అన్నారు. గతంలో పని చేసిన తరువాత నెలల తరబడి వేతనాలు అందక ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు పని చేసిన వారం రోజుల్లోనే వేతనాలు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. అలాగే, పనిచేయగలిగిన వికలాంగులకు ప్రత్యేక కార్డులు జారీ చేసి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. జాబ్ కార్డు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లోనే జాబ్ కార్డు అందజేస్తారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని తొలగిస్తున్నారంటూ కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని, ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో దండ్ల సురేష్, చొప్పరి లక్ష్మణ్, ఉప్పుల సంజీవ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

- ఎమ్మెల్యే నాగరాజు, డిసిసి అధ్యక్షుడు ఆయూబ్ పిలుపు

**వేద న్యూస్, వర్ధన్నపేట:**



వర్ధన్నపేట మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు సాధించి మున్సిపాలిటీని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పని చేయాలని వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్ అన్నారు. బుధవారం వర్ధన్నపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో వరంగల్ డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త ఈగ దామోదర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గత పదేళ్లలో పాలకులు చేయని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, డిసిసి అధ్యక్షుడు ఆయూబ్ దామోదర్‌కు పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సమావేశంలో ఆయూబ్ మాట్లాడుతూ, సీటు ఎవరికిచ్చినా అందరూ ఐక్యతతో పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కాంగ్రెస్ అధికార ప్రతినిధి శేఖర్ రావు, పట్టణ అధ్యక్షుడు మైస సురేష్, మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, సీనియర్ నాయకుడు చిటూరి అశోక్, యూత్ అధ్యక్షుడు భాను ప్రసాద్, కార్పొరేటర్లు సారయ్య, అనిల్, చిట్టి, అరుణ విక్టర్‌తో పాటు వర్ధన్నపేట కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# స్పీడ్ బ్రేకర్లు వేయించండి..

- నోటీస్ బోర్డుపై రాసిన కాలనీవాసులు
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు

**వేద న్యూస్, మడికొండ:**




గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజీపేట పట్టణం, మడికొండ 64వ డివిజన్ టీఎన్జీఓస్ కాలనీ ఫేజ్-3లో ఒక విచిత్ర ఘటన చోటుచేసుకుంది. కాలనీలోని రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలంటూ స్థానికులు నోటీసు బోర్డుపై రాసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కాలనీలో వాహనాలు అధిక వేగంతో దూసుకెళ్లడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదని వారు మండిపడుతున్నారు. ప్రజల సమస్య నోటీసు బోర్డుపై రాయాల్సిన పరిస్థితి వచ్చిందంటే పాలనపై, అధికారుల నిర్లక్ష్యంపై ప్రశ్నార్థకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలనీలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

# మున్సిపల్ ఎన్నికల కోడ్ పక్కాగా అమలు కావాలి

- నామినేషన్ల ప్రక్రియలో అలసత్వం వద్దు: కలెక్టర్ అభిలాష అభినవ్
- నిర్మల్, భైంసాలలో నామినేషన్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ
- పారదర్శకత కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు



**వేద న్యూస్, నిర్మల్ ప్రతినిధి :**

జిల్లాలో జరుగుతున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని, నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్.. జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి భైంసాలో, అలాగే నిర్మల్ పట్టణంలో పర్యటించి నామినేషన్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

**నిఘా పెంచండి.. డబ్బు రవాణాపై కన్నేయండి**

కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. సరైన అనుమతి పత్రాలు లేకుండా పరిమితికి మించి నగదును తరలిస్తే సీజ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బందికి తగిన శిక్షణ ఇవ్వాలని, బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని తెలిపారు. నామినేషన్ల నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోనూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

**అభ్యర్థులకు ఇబ్బందులు కలగకూడదు**

భైంసా మున్సిపల్ కార్యాలయం, నిర్మల్ మున్సిపాలిటీ మరియు జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన 'హెల్ప్ డెస్క్'ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు సందేహాలను నివృత్తి చేయాలని, వారికి అవసరమైన ప్రభుత్వ ధృవీకరణ పత్రాలను అధికారులు వెంటనే అందించాలని సూచించారు. కేంద్రాల వద్ద త్రాగునీరు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించాలని, రిజిస్టర్ల నిర్వహణ పక్కాగా ఉండాలని తహసీల్దార్లను, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

**ఫిర్యాదులకు హెల్ప్ లైన్**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో పారదర్శకత కోసం, ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రకటించారు. ఎన్నికలపై ఏవైనా సమస్యలు ఉంటే 9100577132 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ పర్యటనలు మరియు సమావేశాల్లో ఎస్పీ జానకి షర్మిళ, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, ఆర్డీఓ రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, జెడ్పీ సీఈఓ శంకర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు షుజాఉద్దీన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు ప్రవీణ్, రాజు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మానేరు వాగులో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన కానిస్టేబుల్స్ గంగరాజు, అనిల్

**వేద న్యూస్, తంగళ్ళపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన సుర నవీన్ (27) అనే యువకుడు బుధ వారం సాయంత్రం తంగళ్ళపల్లి బ్రిడ్జి వద్ద మానేరు వాగులోకి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఆ సమయంలో విధి నిర్వహణలో భాగంగా అటువైపు వెళ్తున్న డిస్ట్రిక్ట్ గార్డ్ కానిస్టేబుల్స్ గంగరాజు, అనిల్ వెంటనే స్పందించి వాగులోకి దూకి యువకుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. వారి ధైర్యసాహసంతో యువకుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి యువకుడితో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించి ప్రాణాపాయం లెక్కచేయకుండా యువకుడిని రక్షించిన డిస్ట్రిక్ట్ గార్డ్ కానిస్టేబుల్స్ గంగరాజు, అనిల్‌లను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.

# పెద్దోళ్లను వదిలేసి..

# పేదోళ్ల ఇండ్లు కూల్చి..!



**- కోర్టు స్టే ను లెక్కచేయకుండా అధికారుల కూల్చివేతల తీరే సపరేటు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం నగరంలో అభివృద్ధి పేరుతో పేదలపై దాడులు కొనసాగుతున్నాయి. కోర్టు స్టే ఉన్నప్పటికీ, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ప్రజాభీష్టం మేరకే రోడ్డు విస్తరణ ఉంటుందని హామీ ఇచ్చినా, అధికారులు పేదల ఇండ్లను కూల్చివేస్తూ హింసాత్మక చర్యలు తీసుకున్నారు. రోజువారీ కూలీ పనులు చేసుకుంటూ, అప్పులు చేసి కష్టపడి నిర్మించుకున్న పేదల ఇండ్లను జేసీబీలతో నేలమట్టం చేయడం ద్వారా నిరుపేదల జీవనాన్ని నాశనం చేశారు. ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా, ఇండ్లలో ఉన్న సామాన్లను కూడా తీసుకునే అవకాశం ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టడం బాధితులను కన్నీటిపర్యంతం చేసింది. ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ పరిధిలోని సుందరయ్యనగర్, శ్రీనివాసనగర్, ప్రకాశ్ నగర్, పంపింగ్ వెల్ రోడ్ ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పేరుతో పేదల నివాసాలను తొలగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రోడ్డు సరిపోతుందని, సీసీ రోడ్డు నిర్మిస్తే చాలని ప్రజలు చెబుతున్నప్పటికీ, 70, 80, 100 అడుగుల వరకు విస్తరణ చేయడం వెనుక కార్పొరేటర్ల భర్తల కమీషన్లే కారణమని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాలువ ఆక్రమణ పేరుతో కూల్చివేతలు జరుగుతున్నా, అక్కడ కాలువ కేవలం 30 అడుగుల మేర మాత్రమే ఉందని, మిగతా భూములు ప్రైవేట్ భూములేనని స్థానికులు చెబుతున్నారు. అప్పట్లో భూములు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నారని, దురుద్దేశంతోనే మార్కింగ్ చేయించారని వారు ఆరోపిస్తున్నారు. 28వ డివిజన్ పరిధిలోని ప్రకాశ్ నగర్ ప్రాంతంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఇండ్లను కూల్చివేయడం స్థానికులకు తీవ్ర ఆవేదనను కలిగించింది. పక్షవాతంతో బాధ పడుతున్న మహిళలు "ఇప్పుడు మేము ఎక్కడికి వెళ్లాలి" అని రోడ్డుపై కూర్చుని కన్నీటిపర్యం తమయ్యారు. కొంత సమయం ఇవ్వాల ని వేడుకున్నా అధికారులు కనికరిం చలేదని వారు తెలిపారు. అభివృద్ధి పేరుతో పేదలపై మాత్రమే చర్యలు తీసుకుంటూ, నగరంలోని పెద్దలు, బడాబాబులు ఆక్రమించిన చెరువులు, భూముల పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లకారం వంటి చెరువుల ఆక్రమణలపై నోరు మెదపకపోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వారు మండిపడుత ున్నారు. గతంలో మంత్రిని మూడు సార్లు కలిసినప్పటికీ, ప్రజాభీష్టం మేరకే రోడ్డు విస్తరణ ఉంటుందని హామీ ఇచ్చినప్పటికీ, ఆ హామీలకు విలువ లేకుండా కూల్చివేతలు కొనసాగడం పాలకుల నియంతృత్వ ధోరణిని బయటపెడు తోంది అని ప్రజలు అన్నారు. ఇళ్ల కూల్చివేతను ప్రశ్నిస్తూ



బాధితులకు అండగా నిలిచిన సీపీఐ (ఎం) నాయకులపై పోలీసులు నిర్బంధాలు విధించారు. బుధవారం ఉదయం పార్టీ నాయకులను గృహనిర్బంధం చేయగా, కూల్చివేతలను అడ్డుకున్న స్థానికులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వందలాది మంది పోలీసులను మోహరించి కూల్చివేతలు చేపట్టడంతో ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనపై సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రం తీవ్రంగా స్పందించారు. పేదల ఇండ్లను కూల్చి వారిని నిరాశ్రయులను చేయడం అన్యాయమని, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధమని వారు పేర్కొన్నారు. అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ పేదల ఇళ్లను కూలిస్తే చూడమని, బాధితులకు ప్రత్యామ్నాయం చూపే వరకు పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## అతికం రాజశేఖర్ గౌడ్‌కు సత్కారం

**వేద న్యూస్, బోయినిపల్లి :**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలానికి చెందిన అతికం రాజశేఖర్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వీఎన్ఆర్ ఫౌం డేషన్ వ్యవస్థాపకులు అల్ఫోర్స్ డా. వీ నరేందర్ రెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వార్డు సభ్యుల సంక్షేమం కోసం చేపట్టే కార్యక్రమాలకు తన వంతు సహకారం, అండ ఎప్పటికీ ఉంటుందని హామీ ఇచ్చారు. వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి సంఘం చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఆడెపు దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌తో మున్సిపల్ ఎన్నికల పరిశీలకుడి భేటీ

**వేద న్యూస్, నిర్మల్ ప్రతినిధి :**



నిర్మల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. వీరా రెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ భేటీలో.. వీరా రెడ్డి కలెక్టర్‌కు మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం వీరిరువురు కాసేపు సమావేశమయ్యారు. జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణ, ప్రస్తుతం కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ, మరియు ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఇరువురు అధికారుల మధ్య సంభాషణ జరిగింది.

## మోడల్ స్కూల్‌లో సీఎం కప్ పోటీలు ప్రారంభం

**వేద న్యూస్, వీర్నపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సీఎం కప్ క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఎంపీడీఓ, సర్పంచ్ మాట్లాడుతూ.. సీఎం కప్ పోటీలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదుగుతారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ వంటి వివిధ క్రీడలను నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులను మండల, జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డా. కే అశోక్, ఎంఈఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీలేఖ, తహసీల్దార్ ముక్తార్ పాషా, గ్రామ సర్పంచ్ మల్లరపు జ్యోష్న, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

## నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం




**- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం కొరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం 21వ డివిజన్ లో రూ. 545.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో మురికి కాల్వల సమస్యలకు శాశ్వత పరిష్కారం అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి రూ. 1250 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం చేపడతామని మంత్రి తెలిపారు. ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య లేకుండా మరో 250 కోట్లతో తాగునీటి పథకం పనులు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. నగరంలో అన్ని మౌళిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధ చర్యలు చెప్పట్టిందని అన్నారు. ఖమ్మం నగరం క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండేలా పౌర సహకారంతో అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. నగరం పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉండేలా ప్రతిఒక్కరు తమ వంతు బాధ్యత నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 20న టీజీ ఎడ్‌సెట్ నోటిఫికేషన్

**- ఉన్నత విద్యా మండలి నిర్ణయం**

**వేద న్యూస్, కేయూ క్యాంపస్ :**



టీజీ ఎడ్‌సెట్-2026 నోటిఫికేషన్‌పై బుధవారం హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టా రెడ్డి, టీజీ ఎడ్‌సెట్ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, వైస్ చైర్మన్లు ఆచార్య ఈ. పురుషోత్తం, ఆచార్య ఎస్.కే. మహమూద్, సెక్రటరీ ఆచార్య శ్రీరామ్ వెంకటేష్, కన్వీనర్ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 20వ తేదీన విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణను ఫిబ్రవరి 23వ తేదీ నుంచి ప్రారంభిస్తామని, ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఏప్రిల్ 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. అలాగే, కంప్యూటర్ ఆధారిత పరీక్షలను మే 12వ తేదీన రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

## మేడారం జాతర ఏర్పాట్లు అభినందనీయం

**- తక్కువ సమయంలో దర్శనం..భక్తుల హర్షం**

**వేద న్యూస్, మేడారం:**

శ్రీ సమ్మక్కసారలమ్మ మేడారం మహాజాతర సందర్భంగా ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈసారి మేడారంలో తక్కువ సమయంలో దర్శనం జరుగుతోందని, భారీ రద్దీ ఉన్నప్పటికీ ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా, క్యూ లైన్లో ఇబ్బందులు లేకుండా దర్శనం సాఫీగా సాగుతోందని భక్తులు పేర్కొంటున్నారు. క్రమపద్ధతిలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు, పోలీసులు, వాలంటీర్ల నిరంతరం మార్గనిర్దేశం చేయడంతో దర్శనానికి ఎక్కువ సమయం పట్టడం లేదని తెలిపారు. గత జాతరలతో పోలిస్తే ఈసారి ఏర్పాట్లు మరింత మెరుగ్గా ఉన్నాయని, స్వల్ప వ్యవధిలోనే దర్శనం పూర్తవుతోందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, మేడారం చేరే రహదారులు వెడల్పుగా, సౌకర్యంగా ఉండటంతో వాహనాల రాకపోకలు సులభంగా సాగుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు చాలా వరకు తగ్గాయని భక్తులు తెలిపారు. పార్కింగ్ ప్రాంతాల నుంచి గద్దెల వరకు స్పష్టమైన దారి సూచనలు ఏర్పాటు చేయడంతో దారి తప్పే పరిస్థితి లేకుండా ఉందని పేర్కొన్నారు. భారీగా భక్తులు తరలివస్తున్నప్పటికీ వైద్య సేవలు, తాగునీటి



సౌకర్యాలు, పరిశుభ్రత, భద్రతా చర్యలు అన్నీ సమర్థవంతంగా అమలవుతున్నాయని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉండటం భక్తులకు భరోసానిస్తోందని తెలిపారు. మొత్తంగా, భక్తుల సౌకర్యాన్ని ప్రధానంగా తీసుకుని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లు ప్రశంసనీయమని, అధికారుల సమన్వయంతో ఈసారి మేడారం జాతర ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో సాగుతోందని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**వేద న్యూస్, చిన్న చింతకుంట:**




చిన్న చింతకుంట మండలం దామగ్నపూర్ గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కల్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

## మంత్రిని కలిసిన సర్పంచ్ దేశ్‌పాండే నర్సింగరావు

**- గ్రామ సమస్యల పరిష్కారానికి వినతి**



వేద న్యూస్, టేక్మాల్:

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామ సర్పంచ్ దేశ్‌పాండే నర్సింగరావు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించిన ముఖ్య సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో అవసరమైన మౌలిక వసతులు, ఆరోగ్య సంబంధిత అవసరాలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సర్పంచ్ వివరించగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధిపై నిరంతరం శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ కృషిని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాగుతున్న ఈ నాయకత్వంతో గ్రామం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు.

# కప్పు కొట్టే వరకు విశ్రమించకండి

– డాక్టర్ తుమ్మల యుగంధర్

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఇందిరాగాంధీ ఐదవ జాతీయ ఐదవ సీనియర్ ఉమెన్ టీ20 క్రికెట్ టోర్నమెంట్2026లో పాల్గొంటున్న క్రీడాకారిణులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించి కప్పు సాధించే వరకు విశ్రమించకూడదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు డాక్టర్ తుమ్మల యుగంధర్ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్ & బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో మాట్లాడారు. మీ కలలను సాకారం చేసుకోవాలని, మీరు ఎంచుకున్న లక్ష్యాలు దరిచేరే వరకు వెనకాడవద్దని సూచించారు. ప్రతి క్రీడాకారిణికి విద్య, క్రీడా రెండూ ప్రధానమని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ పేరిట మహిళా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న ఖమ్మం క్రికెట్ అసోసియేషన్ కన్వీనర్ మహమ్మద్ మతిన్, ఏడబ్ల్యూటీసీఏ డైరెక్టర్ సందీప్ ఆర్యలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారుల అభ్యున్నతికి తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని తెలిపారు. ప్రతి క్రీడాకారిణి తమ తల్లిదండ్రుల కలలను నెరవేర్చుతూ ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, సిటీ సెంట్రల్ లైబ్రరీ మాజీ చైర్మన్ మహమ్మద్ అశ్రీఫ్, నాయకులు ఫరీఫ్ ఖాద్రి, రాజస్థాన్ మార్బుల్స్ అధినేత భావర్జి, ఉమేష్ జీ, సైద్ బాబు తదితరులు పాల్గొన్నారు. తదుపరి జరిగిన మ్యాచ్‌లలో తెలంగాణ వర్సెస్ తమిళనాడు పోరులో తెలంగాణ జట్టు 140 పరుగుల భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన



తెలంగాణ జట్టు 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. అన్షు సహని 66 బంతుల్లో 87 పరుగులు చేయగా, వైష్ణవి 46, నేహా గుండెల 42 పరుగులు చేశారు. తమిళనాడు బౌలర్ జైశ్రీ రెండు వికెట్లు తీశారు. 210 పరుగుల లక్ష్యంతో దిగిన తమిళనాడు జట్టు 64 పరుగులకే పరిమితమైంది. విదర్భ వర్సెస్ మహారాష్ట్ర మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు 121 పరుగులు చేయగా, విదర్భ జట్టు 124 పరుగులు చేసి విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ వర్సెస్ ఢిల్లీ మ్యాచ్‌లో ఏపీ జట్టు 144 పరుగులు చేయగా, ఢిల్లీ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసి గెలుపొందింది. ఈనెల 29వ తేదీన ఢిల్లీ వర్సెస్ మహారాష్ట్ర, ఉత్తరాఖండ్ వర్సెస్ తమిళనాడు, తెలంగాణ వర్సెస్ ఉత్తరప్రదేశ్ జట్లు తలపడనున్నాయని టోర్నమెంట్ కన్వీనర్ మహమ్మద్ మతిన్, డైరెక్టర్ సందీప్ ఆర్యలు తెలిపారు.

# మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

– ఐదు మున్సిపాలిటీల్లో విజయం లక్ష్యంగా కాంగ్రెస్ నేతల సన్నాహక సమావేశం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలనే లక్ష్యంతో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో జిల్లాలో మూడు మున్సిపాలిటీలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం రెండు కొత్త మున్సిపాలిటీలు చేరి మొత్తం ఐదు మున్సిపాలిటీలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ ఐదు మున్సిపాలిటీల్లోనూ కాంగ్రెస్ జెండా విజయకేతనం ఎగురవేయాలనే లక్ష్యంతో ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన, సంక్షేమ పథకాల ఫలితాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్లకు వివరించాలని సూచించారు. అలాగే అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యర్థుల విజయానికి అహర్నిశలు శ్రమించాలని కోరారు. ఈ సమావేశంలో శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, శాసనమండలి మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల,



బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య తదితరులు పాల్గొన్నారు. నేతలు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చొప్పదండి మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేస్తాం

– కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేయాలి
– మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మున్సిపాలిటీపై గులాబీ జెండాను ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం చొప్పదండి పట్టణంలో పట్టణ టీఆర్ఎస్ అధ్యక్షులు బత్తిని సంపత్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ కార్యకర్తలంతా సమన్వయంతో, ఏకతాటిపై నిలబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు తుంగబాలు మాట్లాడుతూ.. చొప్పదండి మున్సిపాలిటీలోని 14 వార్డుల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమైనవని, ప్రతి ఒక్కరూ తమ పాత్రను సక్రమంగా నిర్వర్తించినప్పుడే అన్ని స్థానాల్లో గెలుపు సాధ్యమవుతుందని అన్నారు. పార్టీ కార్యకర్తలే అభ్యర్థుల గెలుపు బాటను నిర్ణయిస్తారని, ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసినప్పుడే చొప్పదండి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని, ఎవరు అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, రేవెల్లి సర్పంచ్ బందారపు అజయ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఆరెల్లి చంద్రశేఖర్, గడ్డం చుక్కారెడ్డి, మాజీ విండో చైర్మన్ మినుపాల తిరుపతిరావు, మాజీ కౌన్సిలర్లు కొత్తూరు మహేష్, రాగంపేట సర్పంచ్ మామిడి రాజేశం, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కొత్త గంగారెడ్డి, మాజీ కో–ఆప్షన్ సభ్యులు ఎండి అజ్జు, ఎండి జహీర్, నాయకులు మావురపు మహేష్, పోరండ్ల నితీష్, పెద్దెల్లి అనిల్, నరేష్ రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**వేద న్యూస్ నిర్మల్ ప్రతినిధి:**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా సాగేలా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్పష్టం చేశారు. బుధవారం ఆమె నిర్మల్ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తును క్షుణ్ణంగా పరిశీలించారు. నిఘా నీడలో నామినేషన్లు ఈ సందర్భంగా ఎస్పీ పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులు, వారి అనుచరులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటించేలా చూడాలన్నారు. కేంద్రాల వద్ద గుంపులు గుంపులుగా రావడం, నినాదాలు చేయడం, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధమని ఆమె హెచ్చరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని, నామినేషన్ కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, మెటల్ డిటెక్టర్లు,



బారికేడ్లతో పటిష్ట రక్షణ వలయం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు

– వర్షకొండ సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకునేందుకు సులువైన మార్గం ఏర్పడుతుందని వర్షకొండ గ్రామ సర్పంచ్ పొనుకంటి చిన్న వెంకట్ అన్నారు. బుధవారం వర్షకొండ హైస్కూల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు రానున్న వార్షిక పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యతోనే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. అంతకు ముందు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గంతో జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి, పలు అభివృద్ధి పనులపై చర్చించి తీర్మానాలను ఆమోదించారు. అనంతరం రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తుమ్మల జయ నర్సయ్య, వార్డు సభ్యులు ఆవుల శ్రీనివాస్, సాల్వాల గంగాధర్, మద్దెనపెల్లి జలెందర్, పిప్క చంద్రశేఖర్, కాళేశ్వరం రాకేష్, తాండ్ర దశరథం, అరేపెల్లి సాయమ్మ, గుర్రు నీలా, తోకల లక్ష్మి, సాల్వాల లావణ్య, దుబాసి నవనీత, గ్రామ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సౌత్ జోన్ మహిళా క్రికెట్‌లో

– కేయూ జట్టు ఘన విజయం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



తమిళనాడు రాష్ట్రంలోని అన్నా విశ్వవిద్యాలయం వేదికగా జనవరి 26 నుంచి జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళల క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం మహిళల క్రికెట్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో కాకతీయ విశ్వవిద్యాలయం మహిళల జట్టు, అన్నామలై విశ్వవిద్యాలయం (తమిళనాడు) మహిళల జట్టుతో తలపడింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన కేయూ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అన్నామలై విశ్వవిద్యాలయం జట్టు, కేయూ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తట్టుకోలేక 20 ఓవర్లలో 9 వికెట్లకు కేవలం 82 పరుగులకే పరిమితమైంది. దీంతో కాకతీయ విశ్వవిద్యాలయం మహిళల జట్టు 68 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి టోర్నమెంట్‌లో తమ ఆధిక్యతను చాటుకుంది. కేయూ జట్టుకు కోచ్‌గా మట్టెడ కుమార్ వ్యవహరిస్తుండగా, జట్టు మేనేజర్‌గా మహమ్మద్ ఆలీ ఉన్నారు. ఈ విజయంపై కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఆచార్య వై. వెంకయ్య జట్టు సభ్యులను, కోచ్, మేనేజర్‌ను అభినందించారు.

# ఆటో, ట్రాక్టర్ ఢీ

– మహిళ మృతి.. మరికొందరికి గాయాలు
– మానవత్వం చాటుకున్న మెదక్ అదనపు ఎస్పీ మహేందర్
– బాధితులను అంబులెన్సులో ఎక్కించి ఆసుపత్రికి తరలింపు

**వేద న్యూస్, మెదక్:**



మెదక్ జిల్లా అక్కన్నపేట గ్రామ శివారులోని అక్కన్నపేట ఫారెస్ట్ పార్క్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బస్వాపూర్ గ్రామం నుంచి పాతూర్ సంతకు వెళ్తున్న ఆటో అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాద తీవ్రతకు ఆటో పూర్తిగా ధ్వంసమై, ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సమయంలో రామాయంపేట వైపు ప్రయాణిస్తున్న మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ ప్రమాదాన్ని గమనించి వెంటనే అక్కడికి చేరుకున్నారు. సహాయం చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో, ఆయన తన గన్‌మన్ ప్రశాంత్, డ్రైవర్ గోవర్ధన్, స్థానిక సర్పంచ్ సహకారంతో గాయపడిన వారిని స్వయంగా అంబులెన్సులో ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడే ఉండి ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలు సజావుగా కొనసాగించారు. అదనపు ఎస్పీ మహేందర్ చూపిన మానవీయతకు స్థానికులు ప్రశంసలు తెలియజేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్పీ పోటీ

– కత్తెర గుర్తుతో ప్రజల మధ్యకు వెళ్లేందుకు సిద్ధం

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**



మున్సిపల్ ఎన్నికల్లో బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగాలని లక్ష్యంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందడుగు వేసింది. ఖమ్మం జిల్లాలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశం లో టీఆర్పీ పార్టీ మేనిఫెస్టోను అధికారికంగా ప్రకటించారు. టీఆర్పీ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు, పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి బంధారపు నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ప్రజా సమస్యలే కేంద్రంగా మేనిఫెస్టో రూపొందించామని, మున్సిపల్ పాలనలో నిజమైన మార్పు తీసుకురావడమే టీఆర్పీ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కత్తెర గుర్తుపై పోటీ చేయాలనుకునే ఆశావహులు నేరుగా పార్టీని సంప్రదించాలని, ఇతర పార్టీల వద్ద బీఫామ్‌ల కోసం తిరగాల్సిన అవసరం లేదని ఖమ్మం జిల్లా టీఆర్పీ వర్కింగ్ ప్రెసిడెంట్ పెద్దప్రోలు కోటేశ్వరరావు తెలిపారు. ప్రజల తరఫున పోరాడే అభ్యర్థులకు టీఆర్పీ పూర్తి మద్దతు ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీను, వైరా నియోజకవర్గ ఇంచార్జి తేల్లూరి ప్రకాష్, నీట్ట సుదర్శన్, జగదీశ్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేద న్యూస్
గురువారం జనవరి 29, 2026

# చర్చిల అభివృద్ధికి రూ.30 వేల ఆర్థిక సహాయం



**వేద న్యూస్, కౌకుంట్ల:**

కౌకుంట్ల మండల పరిధిలోని ముచ్చింతల గ్రామంలో చర్చిలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేసింది. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ చెక్కును యంబీ యెరుషలేం సంఘ చైర్మన్ కె. క్రిస్టఫర్, చర్చి ట్రెజరర్ కె. కృష్ణలకు గ్రామ సర్పంచ్ సంగిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీ కురుమూర్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రిస్మస్ వేడుకలకు ముందుగా చర్చిల అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. చర్చిలకు నిధులు మంజూరు చేసినందుకు చర్చి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, శ్రీ కురుమూర్తి దేవస్థానం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని చర్చిలతో పాటు దేవాలయాలు, పేదల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

# తహసీల్దార్ ఎల్లన్నకు సన్మానం



**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

చిన్న చింతకుంట మండల తహసీల్దార్ ఎల్లన్న భూభారతి కార్యక్రమంలో ఉత్తమ పనితీరుకు గాను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వెంకటేష్, మొగిలన్న, ఎస్. శేఖర్, గూడూరు శేఖర్, జంగం రవి, మల్లాకర్ తదితరులు పాల్గొని అభినందించారు.

# మేడారం మహాజాతర
# గిరిజన ఆత్మగౌరవానికి నిలువెత్తు సాక్ష్యం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ మహాజాతర తెలంగాణ సమాజానికి ఒక పండుగ మాత్రమే కాదు, ఒక చరిత్ర, ఒక ఉద్యమ స్ఫూర్తి, ఒక జీవన విధానం. అడవుల మధ్య, వన దేవతల సన్నిధిలో జరిగే ఈ మహోత్సవం గిరిజనుల ఆత్మగౌరవానికి, వారి సంస్కృతి పరిరక్షణకు నిలువెత్తు ప్రతీకగా నిలుస్తోంది. తరతరాలుగా తరలివస్తున్న భక్తులతో మేడారం ప్రతి రెండేళ్లకోసారి ఒక మహానగరంలా మారుతుంది.

నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ జాతరలో భక్తి, నమ్మకం, సంప్రదాయం ఒకటిగా మేళవిస్తాయి. సమ్మక్క, సారలమ్మ తల్లుల కథలు గిరిజన సమాజం ఎదుర్కొన్న పోరాటాలకు అద్దం పడతాయి. అన్యాయానికి ఎదురు నిలిచిన తల్లుల త్యాగం, ప్రజల కోసం ప్రాణాలకైనా వెనుకాడని ధైర్యం ఈ జాతరలో ప్రతి అడుగులో కనిపిస్తుంది. అందుకే ఈ పండుగను తెలంగాణ కుంభమేళాగా అభివర్ణిస్తారు.

కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చే ఈ మహాజాతర నిర్వహణ ఒక సవాల్. అడవులు, కొండలు, వాగులు దాటుకుంటూ భక్తులు చేరుకునే మేడారం ప్రాంగణం ఈ రోజుల్లో అభివృద్ధి పనులతో మరింత విస్తరించింది. ఆలయ ప్రాకారాలు, గద్దెలు, రహదారులు, శాశ్వత మౌలిక వసతులు భక్తులకు సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. అయితే ఈ అభివృద్ధి గిరిజన ఆచారాలకు భంగం కలగకుండా, వారి సంప్రదాయాలను కాపాడుతూ జరగాల్సిన అవసరం మరింతగా ఉంది. అభివృద్ధి పేరుతో సంస్కృతి దెబ్బతినకుండా సమతుల్యత పాటించాల్సిన బాధ్యత సమాజానిదే.

మేడారం జాతర ప్రత్యేకత కేవలం భక్తుల సంఖ్యలోనే కాదు, ఇందులో కనిపించే సామాజిక ఐక్యతలోనూ ఉంది. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు ఇక్కడికి చేరుకుంటారు. భాష, ప్రాంతం, కులం అనే తేడాలు లేకుండా అందరూ ఒకే తల్లుల సన్నిధిలో తలవంచుతారు. ఈ ఐక్యతే మేడారం మహాజాతర యొక్క అసలైన శక్తి.

ఈ జాతర ద్వారా మనకు మరో ముఖ్యమైన సందేశం కూడా లభిస్తుంది. సమ్మక్కసారలమ్మ కథలు ప్రజాస్వామ్య పోరాటానికి ప్రతీకలు. ప్రజల హక్కుల కోసం, స్వేచ్ఛ కోసం పోరాడిన వారి స్ఫూర్తి నేటి తరానికి అవసరం. సమాజంలో అన్యాయం, అసమానతలు ఉన్నప్పుడు ప్రశ్నించే ధైర్యం, పోరాడే తత్వం ఈ వన దేవతల కథల్లో నిండి ఉంది. అదే కారణంగా ఈ జాతర కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగా కాకుండా, ఒక సామాజిక ఉద్యమంగా కూడా భావించబడుతుంది.

భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే సమయంలో భద్రత, ఆరోగ్యం, తాగునీరు, పారిశుధ్యం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ప్రభుత్వ విభాగాల సమన్వయం, అధికారుల నిబద్ధత, సేవాభావంతో పనిచేసే సిబ్బంది ఈ జాతర విజయానికి కీలకం. అదే సమయంలో భక్తులు కూడా క్రమశిక్షణ పాటిస్తూ, పరస్పర సహకారంతో ముందుకు రావాలి. జంపన్న వాగులో పుణ్యస్నానాలు, మొక్కుల చెల్లింపు వంటి సంప్రదాయాలు భక్తిశ్రద్ధతో పాటు జాగ్రత్తతో నిర్వహించాల్సిన అవసరం ఉంది.

మేడారం మహాజాతర మన మూలాలను గుర్తు చేస్తుంది. అడవులు, ప్రకృతి, గిరిజన సంస్కృతి ఇవన్నీ మన సమాజంలో ఎంత ముఖ్యమో ఈ పండుగ చెప్పకనే చెబుతుంది. ఆధునికత దిశగా పరుగులు తీస్తున్న కాలంలో కూడా సంప్రదాయాలను కాపాడుకోవడం ఎంత అవసరమో మేడారం ఉదాహరణగా నిలుస్తోంది.

ముగింపుగా చెప్పాలంటే, మేడారం శ్రీ సమ్మక్కసారలమ్మ మహాజాతర ఒక పండుగ కాదు అది ఒక భావజాలం. గిరిజన ఆత్మగౌరవానికి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి, సామూహిక ఐక్యతకు ఇది నిలువెత్తు ప్రతీక. వన దేవతల ఆశీస్సులతో సమాజం శాంతి, సౌభాగ్యాలతో ముందుకు సాగాలని, ఈ మహాజాతర స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించాల్సిన సందర్భమిది. మేడారం సమ్మక్కసారలమ్మ కథలో దాగి ఉన్న ప్రజాస్వామ్య పోరాట స్ఫూర్తి నేటికీ సమాజాన్ని ప్రభావితం చేస్తోంది. అన్యాయానికి ఎదురు నిలవడం, ప్రజల కోసం త్యాగానికి సిద్ధపడటం వంటి విలువలు ఈ వన దేవతల కథల ద్వారా తరతరాలకు అందుతున్నాయి. ఈ స్ఫూర్తే నేటి సమాజానికి అవసరం. ప్రజల కోసం పాలన, ప్రజల కోసం విధానాలు అనే ఆలోచనలకు మేడారం ఒక ప్రేరణ.

ఈ మహాజాతర విజయవంతం కావాలంటే ప్రభుత్వ విభాగాల సమన్వయం, అధికారుల నిబద్ధత, భక్తుల సహకారం ఇవన్నీ కలిసి రావాలి. లక్షలాది మంది తరలివచ్చే సందర్భంలో భద్రత, ఆరోగ్యం, రవాణా, శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. నియమాలు పాటిస్తూ, పరస్పర సహకారంతో జాతరను శాంతియుతంగా నిర్వహించడంలో భాగస్వాములు కావాలి.

మేడారం మహాజాతర మనకు గుర్తు చేసేది ఒక్కటే ఇది ఒక పండుగ కాదు, ఇది ఒక భావజాలం. గిరిజన సంస్కృతి గౌరవం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సామూహిక ఐక్యతకు ఇది నిలువెత్తు ఉదాహరణ. వన దేవతల ఆశీస్సులతో సమాజం ముందుకు సాగాలని, ఈ జాతర ద్వారా మన మూలాలను మరచిపోకుండా భవిష్యత్తును నిర్మించుకోవాలని ఇదే సందేశం.

# ‘మై ఛాయిసెస్’ చొరవతో వృద్ధురాలికి విముక్తి

- అన్నం పెట్టని కొడుకులు, కూతుర్లకు కౌన్సెలింగ్
- తీరు మారకపోవడంతో వృద్ధాశ్రమానికి తరలింపు
- చొరవ చూసిన ‘వేద న్యూస్’



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన గుండెకరి అంబక్క అనే వృద్ధురాలు, తనకు తిండి పెట్టే వారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ సమస్యను గుర్తించిన వేద న్యూస్, మై ఛాయిసెస్ ఫౌండేషన్ సహకారంతో పరిష్కార దిశగా చర్యలు చేపట్టింది. వృద్ధురాలికి అన్నం పెట్టని ఆమె కొడుకులు, కూతుర్లను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అయితే వారి వైఖరిలో మార్పు రాకపోవడంతో, వృద్ధురాలి భద్రత, సంక్షేమం దృష్ట్యా ఆమెను వృద్ధాశ్రమానికి తరలించే నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతిని సంప్రదించగా, ఆమె వెంటనే స్పందించి వృద్ధాశ్రమ నిర్వాహకులతో మాట్లాడి అంబక్కకు అక్కడ చోటు కల్పించారు. మై ఛాయిసెస్ ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మహిళలు ఎదుర్కొనే వివక్ష, గృహహింస, ఆర్థిక, భావోద్వేగ హింస వంటి సమస్యలపై కౌన్సిలింగ్ అందిస్తూ బాధితులకు అండగా నిలుస్తామని తెలిపారు. మహిళలు మౌనంగా హింసను భరించాల్సిన అవసరం లేదని, చట్టాలు, పోలీసులు, కోర్టులు మహిళల రక్షణకే ఉన్నాయని స్పష్టం చేశారు. అలాగే, బాలికలు, విద్యార్థినులు, యువతులు, మహిళలకు విద్య, నివాసం, ఆహారం వంటి అవసరాలను ప్రభుత్వం సహకారంతో ఉచితంగా అందించే అవకాశాలు ఉన్నాయని, ఆదరణ లేని వారు, అనాధలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ జయంతి కోరారు.

# గనులు మూసివేసిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు




- అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలి
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి
- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

**వేద న్యూస్, మంచిర్యాల:**

బొగ్గు గనులు మూసివేసిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు గనులు ఉన్న జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, బొగ్గు కంపెనీల జనరల్ మేనేజర్లతో మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గనులు మూసివేత అనంతరం ఆయా ప్రాంతాలను స్థిరీకరించి సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని ఆదేశించారు. మైన్స్ క్లోజింగ్ యాక్టివిటీలలో భాగంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, క్రీడా మైదానాల నిర్మాణం, పారిశ్రామిక పార్కుల ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. గనుల మూసివేతకు ముందు, తరువాత పరిస్థితులను చూపే ఫోటోలు, వీడియోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా, మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అన్నారు. మైనింగ్ కారణంగా ప్రకృతి దెబ్బతింటుందన్న భావనను ప్రజలలో తొలగిస్తూ, గనులు మూసివేసిన ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో మూసివేసిన గనుల ప్రాంతాల్లో హాస్పిటల్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గనులు మూసివేసిన ప్రాంతాల సామాజిక అభివృద్ధి కోసం జిల్లాకు రూ. 115 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ నిధులను పూర్తిగా ఆయా ప్రాంతాల అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, గనులు భూగర్భ శాఖ ఏ.డి. జగన్ మోహన్, సింగరేణి శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి జి.ఎం. సిహెచ్. వెంకటేశ్వర్లు, ఎస్టేట్స్ మేనేజర్ వరలక్ష్మి, పర్యావరణ విభాగం అడిషనల్ మేనేజర్ హనుమాన్ గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కురుమూర్తి దేవస్థానంలో దిగుడు మెట్ల మార్గం ప్రారంభం



**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన కొత్త దిగుడు మెట్ల మార్గాన్ని డోనర్ల సహకారంతో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానం పాలకమండలి చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డి డోనర్లు, ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఈ మెట్ల నిర్మాణానికి సహకరించిన డోనర్లను చైర్మన్‌తో పాటు పాలకమండలి సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. స్వామి ఆశీస్సులతో దిగుడు మెట్ల పనులు వేగవంతంగా పూర్తికావడంతో దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు భాస్కరాచార్యులు, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల గ్రామంలో అమానుష ఘటన



**అమరావతి, వేద న్యూస్:**

గోపాలపురం మండలం చిట్యాల గ్రామంలో అమానుష ఘటన వెలుగు చూసింది. వ్యసనాలకు బానిసైన ఓ తండ్రి డబ్బుల కోసం తన ఆరు నెలల పసిబిడ్డను అమ్మేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చిట్యాల గ్రామానికి చెందిన జొన్నకూటి వీరయ్య మద్యానికి, ఇతర వ్యసనాలకు అలవాటుపడి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. అప్పుల భారాన్ని తట్టుకోలేక కన్నబిడ్డనే విక్రయించేందుకు సిద్ధమైన అతడు, మధ్యవర్తిత్వంతో దేవరపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన ఆరు నెలల పసిబిడ్డను పది లక్షల రూపాయలకు అమ్మినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన గ్రామస్థులను షాక్‌కు గురి చేసింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే చర్యలు తీసుకుని పసిబిడ్డను విక్రయించిన తండ్రిని, శిశువును కొనుగోలు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని కోర్టుకు తరలించారు. పసిబిడ్డను సురక్షితంగా రక్షించి సంబంధిత అధికారుల సంరక్షణలోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా కొంతమంది పాత్ర ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని పోలీసులు చెప్పారు. మిగిలిన నిందితులను అరెస్టు చేసిన తర్వాతే పూర్తి వివరాలను మీడియాకు వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఈ ఘటన మానవ విలువల పతనానికి అద్దంపడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు విద్యార్థులు మృతి



**వేద న్యూస్ హైదరాబాద్ :**

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది . కారులో ప్రయాణిస్తున్న 8 మంది విద్యార్థులు అతివేగంగా వెళుతూ మెట్రో పిల్లర్ 97ను బలంగా ఢీకొట్టింది ఈ ఘటనలో సాయి వరుణ్, నిఖిల్ అనే ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే చనిపోగా వెంకట్, రాకేష్, యశ్వంత్ అనే ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సాత్విక్, హర్షవర్ధన్, అభినవ్ అనే ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. బాధితులు వనపర్తి జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులుగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ‘పెద్ది’ రిలీజ్ డేట్‌పై సస్పెన్స్..

**వేద న్యూస్ డెస్క్:**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సినిమా ‘పెద్ది’పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రామ్ చరణ్ పూర్తిస్థాయి మాస్ అవతారంలో కనిపించనున్నాడనే వార్తలు అభిమానుల్లో భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, అప్డేట్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. గతంలో ఈ సినిమాను 2026 మార్చి 27న వరల్డ్‌వైడ్ రిలీజ్ చేస్తామని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఆ డేట్‌ను అభిమానులు కూడా క్యాలెండర్‌లో టిక్ పెట్టుకున్నారు. కానీ తాజా పరిస్థితులను బట్టి ఆ తేదీకి సినిమా విడుదల కావడం కష్టమేనన్న టాక్ ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తోంది. ప్రస్తుతం షూటింగ్ ఇంకా పూర్తికాలేదు. కీలకమైన షెడ్యూల్స్ మిగిలి ఉండటంతో పాటు, భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, కలర్ గ్రేడింగ్ వంటి అంశాల్లో ఎలాంటి రాజీ పడకుండా పర్ఫెక్ట్ అవుట్‌పుట్ ఇవ్వాలని మేకర్స్ భావిస్తున్నారట. ఇదిలా ఉండగా తెలంగాణలో టికెట్ రేట్లకు సంబంధించిన పరిస్థితులు కూడా రిలీజ్ టైమింగ్‌పై ప్రభావం చూపవచ్చని సమాచారం. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న సినిమాకు సరైన థియేట్రికల్ రెవెన్యూ రావాలంటే అనుకూలమైన మార్కెట్ పరిస్థితులు అవసరం కావడంతో, తొందరపాటు కాకుండా అన్ని అంశాలు సెట్ అయిన తర్వాతే రిలీజ్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సోషల్




మీడియాలో మరో ఆసక్తికర బజ్ నడుస్తోంది. తాజా ప్రచారం ప్రకారం ‘పెద్ది’ చిత్రాన్ని 2026 దసరా పండుగకు విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారట. వేసవి సీజన్ ఆప్షన్ ఉన్నప్పటికీ, దసరా సీజన్ మాస్ సినిమాలకు బాగా కలిసొచ్చే టైమ్ కావడంతో అదే బెస్ట్ అని భావిస్తున్నారని టాక్. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఆడియన్స్, మాస్ ప్రేక్షకుల సందడి అన్నీ కలిసి వస్తే బాక్సాఫీస్‌పై ప్రభావం మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తానికి ‘పెద్ది’ రిలీజ్ డేట్‌పై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. అధికారికంగా మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. అభిమానులంతా ఇప్పుడు ఒక్కటే ఆసక్తితో ఎదురుచూస్తున్నారు రామ్ చరణ్ మాస్ అవతారం ఎప్పుడు థియేటర్లలో సందడి చేయబోతుందన్నది.

# ధర్మా నుంచి జాన్వీ ఔట్..

## - కరణ్‌కే షాక్ ఇచ్చిన స్టార్ కూతురు నిర్ణయం..!

**వేద న్యూస్ డెస్క్:**



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ తీసుకున్న సంచలన నిర్ణయం సినీ పరిశ్రమలో హాట్‌టాపిక్‌గా మారింది. తనను ఇండస్ట్రీకి పరిచయం చేసి, కెరీర్‌కి అండగా నిలిచిన ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్‌కు చెందిన ధర్మా ప్రొడక్షన్స్ టాలెంట్ మేనేజ్‌మెంట్ నుంచి జాన్వీ బయటకు వచ్చేసింది. ఇకపై తన కెరీర్‌కు సంబంధించిన అన్ని నిర్ణయాలను తానే తీసుకుంటానని ఆమె స్పష్టంగా తెలిపినట్లు సమాచారం. ఇన్నాళ్లూ ఏ సినిమా చేయాలి, ఏ బ్రాండ్‌కు ప్రచారం చేయాలి అన్న విషయాలన్నీ కరణ్ జోహార్ పర్యవేక్షణలోనే జరిగేవి. ఈ కారణంగా జాన్వీపై నెపో ముద్ర ఎక్కువగా పడింది. ఆ విమర్శల నుంచి బయటపడేందుకే ఆమె ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. తల్లి శ్రీదేవి మాదిరిగానే స్వతంత్రంగా ఎదగాలన్న లక్ష్యంతో జాన్వీ ఇప్పుడు కలెక్టివ్ ఆర్టిస్ట్ నెట్‌వర్క్ అనే కొత్త సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం జాన్వీ దృష్టి మొత్తం దక్షిణాది సినిమాలపైనే ఉంది. దేవర సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, ఇప్పుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సరసన పెద్ది సినిమాలో నటిస్తోంది. అంతేకాదు, అల్లు అర్జున్ మరియు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ ప్రాజెక్ట్‌లో కూడా జాన్వీ పేరు దాదాపు ఖరారైనట్లు టాక్ నడుస్తోంది. బాలీవుడ్ పరిమితులను దాటేసి, పాన్ ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సాధించాలనే లక్ష్యంతో జాన్వీ అడుగులు వేస్తుండటంతో సినీ వర్గాలు ఆశ్చర్యపోతున్నాయి.

# సుహాస్ హిలేరియస్ ఎంటర్‌టైనర్..
# నవ్వులు పూయిస్తున్న ‘హే భగవాన్’ టీజర్..!




**వేద న్యూస్ డెస్క్:**

కలర్ ఫోటో, రైటర్ పద్మభూషణ్ వంటి సినిమాలతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సుహాస్ మరోసారి నవ్వుల వర్షం కురిపించేందుకు సిద్ధమయ్యాడు. ఆయన నటించిన కొత్త సినిమా హే భగవాన్ నుంచి తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను తెగ ఆకట్టుకుంటోంది. తండ్రీకొడుకుల మధ్య సాగే సరదా సంభాషణలు, సహజమైన హాస్యం, వినూత్నమైన కథాంశంతో ఈ సినిమా పూర్తిస్థాయి వినోదాన్ని అందించబోతుందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. గోపి అచ్చర దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రానికి కథను షణ్ముఖ ప్రశాంత్ అందించగా, సంగీతాన్ని వివేక్ సాగర్ సమకూర్చాడు. వెన్నెల కిషోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ కీలక పాత్రల్లో నటించారు. షూటింగ్ పూర్తికాగా ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన చివరి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి నరేంద్ర రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తండ్రీకొడుకుల అనుబంధాన్ని హాస్యంతో మేళవించి చూపించడమే ఈ చిత్ర ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఒక రహస్యమైన కుటుంబ వ్యాపారం చుట్టూ తిరిగే కథలో ఆ వ్యాపారం గురించి ఎవరికీ చెప్పకూడదనే నిబంధన తండ్రీకొడుకుల జీవితాన్ని ఎలా మలుపులు తిప్పుతుందో హిలేరియస్‌గా చూపించారు. సీనియర్ నటుడు నరేష్ మరియు సుహాస్ మధ్య సాగే సన్నివేశాలు ప్రేక్షకులకు అదనపు వినోదాన్ని అందించనున్నాయి. టీజర్ విడుదలైన వెంటనే సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన వస్తుండగా, సుహాస్ మరో హిట్ కొట్టబోతున్నాడనే అంచనాలు పెరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. నవ్వులు, భావోద్వేగాలు కలిసి వచ్చే ఈ సినిమా ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందనే నమ్మకం వ్యక్తమవుతోంది.

# దుల్కర్ సినిమాలో మెరిసే శృతి హాసన్..

**వేద న్యూస్ డెస్క్:**




దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఆకాశంలో ఒక తార నుంచి తాజాగా క్రేజీ అప్‌డేట్ విడుదలైంది. ఈ చిత్రంలో శృతి హాసన్ కీలక పాత్రలో నటిస్తుండగా, ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. పోస్టర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్, లైట్ బాక్స్ మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా పరిచయం అవుతోంది. ఇప్పటికే విడుదలైన సాత్విక గ్లింప్స్ గ్రామీణ నేపథ్యంతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు శృతి హాసన్ ఎంట్రీతో సినిమాకు మరింత క్రేజ్ ఏర్పడింది. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం 2026 వేసవిలో తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దుల్కర్ నటన, శృతి హాసన్ పాత్ర, బలమైన కథతో ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతగా ఆకట్టుకుంటుందో చూడాలి.

# స్టార్ క్రికెటర్ పవర్ రహస్యం ఇదేనా..!

## - హనుమాన్ చాలీసాతో మొదలై శరీరం ఉక్కులా మారుతోంది..!



**వేద న్యూస్ డెస్క్:**

మైదానంలో వేగవంతమైన బంతులు, భారీ సిక్సర్లు చూస్తే ఆ స్టార్ క్రికెటర్‌లోని శక్తి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. తరచూ గాయాల బారిన పడినా కూడా మళ్లీ రెట్టింపు వేగంతో పుంజుకుంటూ జట్టుకు కీలకంగా మారుతున్నాడు. అతని పర్‌ఫెక్ట్ ఫిజిక్ వెనుక ఉన్న క్రమశిక్షణ తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య తన దినచర్యను ప్రారంభిస్తాడు. ముందుగా హనుమాన్ చాలీసా పఠించి మనసును ప్రశాంతంగా ఉంచుకుంటాడు. ఆ తర్వాత చల్లని నీటితో స్నానం చేసి శరీరాన్ని ఉత్తేజితం చేసుకుంటాడు. ఉదయం సమయంలో దాదాపు 60 నిమిషాలు యోగ సాధన, మరో 30 నిమిషాలు ధ్యానం చేస్తూ శరీరానికి చురుకుదనం, మనసుకు ఏకాగ్రత పెంచుకుంటాడు. శరీర బలం పెంచుకోవడానికి రోజును రెండు భాగాలుగా విభజిస్తాడు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బలం పెంపొందించే వ్యాయామాలు చేస్తాడు. సాయంత్రం 4 నుంచి 6:30 వరకు వేగం, చురుకుదనం పెరిగే కదలికలపై దృష్టి పెడతాడు. ప్రతి వ్యాయామం తర్వాత శరీరానికి తగినంత విశ్రాంతి ఇస్తాడు. చిన్న విరామాలు తీసుకోవడం, అవసరమైతే కాసేపు నిద్రపోవడం ద్వారా కండరాలు త్వరగా కోలుకునేలా చూస్తాడు. ప్రతిరోజూ స్ట్రెచింగ్ చేయడం కూడా అతని అలవాటు. ఆహారంలో క్రమశిక్షణ అతని బలానికి మరో ప్రధాన కారణం. అధిక ప్రోటీన్, తక్కువ కేలరీలతో కూడిన భోజనం తీసుకుంటాడు. ఉదయం ప్రోటీన్ పానీయాలు, మధ్యాహ్నం పప్పులు, ఆకుకూరలు, అన్నం వంటి శుభ్రమైన భారతీయ ఆహారం తీసుకుంటాడు. సాయంత్రం తేలికపాటి కూరగాయలు లేదా ప్రోటీన్ పదార్థాలతో భోజనం పూర్తి చేస్తాడు. ఆకలిని నియంత్రించేందుకు ప్రత్యేక పానీయాన్ని వినియోగిస్తాడు. శారీరక శిక్షణతో పాటు మానసిక బలానికీ ప్రాధాన్యం ఇస్తాడు. ప్రతిరోజూ డైరీ రాయడం, పుస్తకాలు చదవడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకుంటాడు. కుటుంబంతో గడిపే సమయాన్ని ఎంతో విలువైనదిగా భావిస్తాడు. ఈ క్రమశిక్షణే అతన్ని ఎప్పుడూ ఫిట్‌గా ఉంచుతూ మైదానంలో అద్భుత ప్రదర్శనలకు కారణమవుతోంది. విజయం అదృష్టం వల్ల కాదు.. నిరంతర సాధన, కట్టుదిట్టమైన జీవనశైలి వల్లే సాధ్యమవుతుందనే సందేశాన్ని అతని జీవితం స్పష్టంగా చెబుతోంది.

# భారత్ పై న్యూజిలాండ్ ఘన విజయం

**వేద న్యూస్ డెస్క్:**



విశాఖపట్నంలో జరిగిన 4వ టీ20 మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు భారత్‌ను ఓడించింది. 216 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు 18.4 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌట్ అయింది. భారత జట్టు కోసం శివమ్ దూబె 65 పరుగులు చేసి యథాశక్తి ప్రయత్నించినప్పటికీ, అతని ఔటైన తర్వాత జట్టు గెలుపు దిశలో కొనసాగలేకపోయింది.న్యూజిలాండ్ బౌలర్లలో శాంట్నర్ 3 వికెట్లు తీశాడు, మరోవైపు సోధీ మరియు డఫ్ఫీ ఇద్దరూ 22 వికెట్లు తీశారు. న్యూజిలాండ్ బౌలింగ్ స్ట్రాటజీ భారత బ్యాటింగ్ రైటప్‌ను సమర్థవంతంగా నియంత్రించింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు విఫలమవ్వడానికి ప్రధాన కారణం మధ్య మరియు చివరి ఓవర్లలో పరుగుల లేమిగా చెప్పవచ్చు.న్యూజిలాండ్ విజయం 5 మ్యాచ్ సిరీస్‌లో తుది స్కోరింగ్‌లో సమానత లేకుండా భారత్‌పై ఆధిపత్యాన్ని చాటింది. భారత్ బౌలింగ్ విభాగంలో కొన్ని మంచి ప్రయత్నాలు గమనించబడినప్పటికీ, న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ స్టేబుల్‌గా ఉండి సమయానికి ఎక్కువ పరుగులు చేసేందుకు అవకాశం పొందారు. ఈ మ్యాచ్ ఫలితం భారత జట్టు కోసం ఆత్మవిశ్వాసానికి పెద్ద షాక్‌గా నిలిచింది. కోచ్ మరియు ఆటగాళ్లకు ఈ నెగటివ్ ఫలితం తరువాతి మ్యాచ్‌లలో ప్రదర్శనలో మార్పు అవసరాన్ని సూచిస్తుంది.క్రీడాభిమానులు ఇప్పుడు తుది 5వ మ్యాచ్‌పై అంచనాలు వేస్తూ, భారత జట్టు ఈ సిరీస్‌లో మరలా సమరసత పొందుతుందా అని వేచిచూస్తున్నారు.

# టీ20 ర్యాంకింగ్స్‌లో సూర్య దూకుడు.. భారత బ్యాటర్లు సత్తా చాటారు

**వేద న్యూస్ డెస్క్:**



అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన టీ20 ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాళ్లు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ముఖ్యంగా బ్యాటర్లు తమ ర్యాంకులను గణనీయంగా మెరుగుపర్చుకొని అభిమానులకు ఆనందాన్ని పంచారు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఐదు స్థానాలు ఎగబాకి టాప్ స్థాయికి చేరుకున్నాడు. గత ర్యాంకింగ్స్‌లో 12వ స్థానంలో ఉన్న సూర్యకుమార్ ఈసారి నేరుగా 7వ స్థానానికి దూసుకెళ్లాడు. ప్రస్తుతం అతడు 717 రేటింగ్ పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి భారత బ్యాటింగ్ బలాన్ని ప్రపంచానికి మరోసారి చాటాడు. కీలక మ్యాచ్‌ల్లో నిలకడగా పరుగులు సాధించడం, వేగంగా స్కోరు పెంచడం అతడి ర్యాంక్ పెరుగుదలకు ప్రధాన కారణంగా మారింది. ఇదే కాకుండా ఇతర భారత బ్యాటర్లు కూడా తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. యువ ఆటగాళ్లు స్థిరమైన ప్రదర్శనతో ముందుకు సాగుతుండగా, అనుభవజ్ఞులు తమ స్థాయిని నిలబెట్టుకుంటూ జట్టుకు బలంగా నిలుస్తున్నారు. రాబోయే అంతర్జాతీయ టోర్నీలను దృష్టిలో పెట్టుకుంటే ఈ ర్యాంకింగ్స్ భారత జట్టుకు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించనున్నాయి. టీ20 ఫార్మాట్‌లో భారత జట్టు ఆధిపత్యం కొనసాగుతుండటం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. రాబోయే మ్యాచ్‌ల్లో కూడా ఇదే జోరు కొనసాగిస్తారని క్రికెట్ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073